



విద్యుత్ దీపాల వెలుగుల్లో పాతపట్నం నీలమణి దుర్గ ఆలయం

ఉత్సవాలకు వేళాయె!

- నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు
- ముస్తాబైన ఆలయాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు



శ్రీకాకుళం కల్చరల్/ఇచ్ఛాపురం/పాతపట్నం, అక్టోబరు 2: జిల్లాలో దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. గురువారం నుంచి దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 12 వరకు తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఇందుకోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పాతపట్నం నీలమణి దుర్గ, కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి, ఇచ్ఛాపురం స్వేచ్ఛావతి, శ్రీకాకుళం నగరంలోని బాకర్‌సాహెబ్‌పేట దుర్గామహాలక్ష్మి, నానుబాలవారి వీధిలోని దుర్గా, మహాలక్ష్మి నగర్ కాలనీలోని కాత్యాయని, నక్కవీధిలోని ఉమాదేవి, కాకివీధిలోని ముత్యాలమ్మ, పెద్దబరాటం వారి వీధిలోని నీలమ్మ తల్లి ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. గురువారం స్వర్ణకవచ అలంకరణ, 4న బాలత్రిపుర సుందరి, 5న గాయత్రీ, 6న అన్నపూర్ణ, 7న లలితా, 8న మహాలక్ష్మి, 9న సరస్వతీ, 10న దుర్గాదేవి, 11న మహిషాసుర మర్దిని, 12న శ్రీ రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వేచ్ఛావతి అమ్మవారు



విద్యుత్ కాంతుల్లో ఇచ్ఛాపురం స్వేచ్ఛావతి ఆలయం



శ్రీకాకుళం బాకర్‌సాహెబ్‌పేటలోని దుర్గామహాలక్ష్మి

నేటి నుంచి టెట్

- జిల్లాలో మూడు, ఒడిశాలో మూడు కేంద్రాలు ఏర్పాటు
- ఈనెల 21 వరకు పరీక్ష నిర్వహణ
- హాజరుకానున్న 16,185 మంది అభ్యర్థులు



నరసన్నపేటలోని పరీక్ష కేంద్రం

నరసన్న పేట, అక్టోబరు 2: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహణకు విద్యాశాఖ అధికారులు అంతా సిద్ధం చేశారు. గురువారం నుంచి ఈ నెల 21 వరకు ఈ పరీక్ష జరగనుంది. దీనికోసం జిల్లాలో మూడు కేంద్రాలు, ఒడిశా రాష్ట్రంలో మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో 16,185 మంది అభ్యర్థులు టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నారు. కోర్ టెక్నాలజీ (నరసన్నపేట) పరీక్ష కేంద్రంలో 10,091 మంది, శ్రీ శివాని ఇంజనీరింగ్ కళాశాల(చిలకపాలెం)లో 1,020 మంది, శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల(ఎచ్చెర్ల)లో 3,200 మంది, ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా బరంపురం సమీపంలోని కళ్లికోట అయాన్ డిజిటల్ జోన్‌లో 734 మంది, బరంపురం ఎస్ఐఎంటీలో 353 మంది, ఎస్ఎంఐటీ డిగ్రీ అండ్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 787 మంది పరీక్ష రాయనున్నారు. జిల్లాలోని పరీక్ష కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతను నరసన్నపేట, ఎచ్చెర్ల, లావేరు విద్యాశాఖ అధికారులకు అప్పగించారు. ఒడిశాలోని కేంద్రాల బాధ్యతను రాజపురం, మండపల్లి, ధర్మవరం ప్రధానోపాధ్యాయులు (డీవోలు)కు అప్పగించారు. కాగా, ఒడిశాలో పరీక్ష కేంద్రాలు కేటాయించడంపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, గత ప్రభుత్వ హయాంలో జిల్లా విద్యార్థుల్లో కొందరికి ప్రకాశం, చిత్తూరు, కృష్ణ, నెల్లూరు జిల్లాల్లో పరీక్ష కేంద్రాలు కేటాయించారు. ఈసారి ఆలస్యంగా దరఖాస్తు చేసుకున్నవారికి జిల్లాకు 130 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న బరంపురంలోని కేంద్రాలను కేటాయించినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. రోజుకు రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థులు గంటన్నర ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. హాల్ టిక్కెట్‌తో పాటు ఆధార్ కార్డును తప్పనిసరిగా తీసుకువెళ్లాలి.

వంశధార రెండో దశ పూర్తి చేస్తాం

- త్వరలో ఎడమ ప్రధాన కాలువను ఆధునికీకరిస్తాం
- ఒడిశాతో ఉన్న ఇబ్బందులు తొలగించేందుకు కృషి
- కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు
- సీఆర్ఎం పట్నాయక్ విగ్రహ ఆవిష్కరణ



సీఆర్ఎం పట్నాయక్ విగ్రహావిష్కరణలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

జిల్లా జీవనాడి వంశధార ప్రాజెక్టు రెండో దశను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పూర్తిచేస్తామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం వంశధార కార్యాలయంలో వంశధార ప్రాజెక్టు రూపశిల్పి సీఆర్ఎం పట్నాయక్, మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. అతి త్వరలో వంశధార ఎడమ ప్రధాన కాలువను ఆధునికీకరిస్తామని చెప్పారు. 'త్వరలోనే నాగావళి, వంశధార నదుల అనుసంధానాన్ని పూర్తిచేస్తాం. ఇందుకోసం ప్రపంచ బ్యాంకు నిధులైనా, కేంద్రం నుంచి నిధులైనా తీసుకుని వస్తాం. నేరడి బ్యారేజీకి సంబంధించి ఒడిశాతో ఉన్న అడ్డంకులను తొలగిస్తాం. అవసరమైతే ఒడిశా సీఎంతో మన ముఖ్యమంత్రి చర్చిస్తారు. రెండు రాష్ట్రాల మధ్య ఇబ్బందులు లేకుండా నేరడి బ్యారేజీని పూర్తిచేస్తాం. సీఆర్ఎం పట్నాయక్ వంటి మహోన్నత వ్యక్తులను భగవంతుడు జన్మించకుంటే శ్రీకాకుళం జిల్లాలో వంశధార ప్రాజెక్టు అనేది ఉండేది కాదు. దేశంలో, ప్రపంచంలో ఎక్కడైనా నీటికొరత ఉంటుంది. మన రాష్ట్రంలో రాయలసీమ వంటి ప్రాంతాల్లో కొరత ఉన్నా శ్రీకాకుళం జిల్లాలో ఆ పరిస్థితి లేదు. ఇక్కడ బ్రహ్మాండమైన జీవనదులు వంశధార, నాగావళి ఉన్నాయి. అయినప్పటికీ ఇంకా జిల్లా వెనుకబాటుతనం గురించి మాట్లాడుతూనే ఉన్నాం. సమర్థవంతమైన నీటిపారుదలతోనే అభివృద్ధి సాధ్యం. సీఆర్ఎం పట్నాయక్ లాంటి ఆణిముత్యాలు జిల్లాలో చాలామంది ఉన్నారు. అది మనందరి అదృష్టం.' అని తెలిపారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ప్రజలకు ఉపయోగపడే వ్యక్తులు చరిత్రలో చిరస్థాయిగా మిగిలిపోతారని అన్నారు. సీఆర్ఎం పట్నాయక్ లేకుంటే వంశధార ప్రాజెక్టే లేదన్నారు. మహాత్మాగాంధీ పుట్టినరోజు నాడే ఇద్దరు గొప్పవ్యక్తుల విగ్రహాలను ఆవిష్కరించుకోవడం మరిచిపోలేని విషయమని చెప్పారు. ఒడిశాతో ఉన్న అభ్యంతరాలను తొలగించి త్వరలోనే నేరడి బ్యారేజీ నిర్మాణాన్ని మొదలు పెడతామన్నారు. జిల్లాను అపర అన్నపూర్ణగా తీర్చిదిద్దుతామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, నార్త్‌కోస్ట్ సీఈ సుగుణాకరరావు, వంశధార ఎస్ఈ రాంబాబు, ఏపీటీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు, ఒడిశా రిటైర్డ్ సీఈ సీవీ ప్రసాద్, సీఆర్ఎం పట్నాయక్ కుమారుడు సి.ఈశ్వర్‌మోహన్, కల్నల్ పీవీ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మార్గంలో పయనించాలి

- మంత్రి అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి: స్వాతంత్ర్య సముపార్జనకు కృషి చేసి, గ్రామస్వరాజ్య స్థాపనకు నాంది పలికిన మహాత్మా గాంధీ బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం నిమ్మాడ గ్రామంలో జాతిపిత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బంగారు వర్ణంలో ఆదిత్యుడు

- రెండో రోజూ స్వామివారిని తాకిన కిరణాలు



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అరసవల్లి, అక్టోబరు 2: ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి మూల విరాట్‌ను రెండో రోజు బుధవారం కూడా భానుడి లేలేత కిరణాలు తాకాయి. దీంతో ఆదిత్యుడు బంగారు వర్ణంలో ధగధగ మెరిసిపోయాడు. ప్రతీ ఏడాది అక్టోబరు 1, 2 తేదీల్లో స్వామివారిని కిరణాలు తాకుతాయి. కానీ, గత రెండేళ్లుగా మబ్బుల కారణంగా ఆదిత్యుని కిరణాలు తాకలేదు. ఈ ఏడాది మాత్రం ఆ పరిస్థితి ఏర్పడలేదు. తొలిరోజు మంగళవారం స్వామివారిని కిరణాలు స్పృశించాయి. దీంతో రెండో రోజు బుధవారం ఉదయాన్నే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి మూల విరాట్‌ను కిరణాలు సంపూర్ణంగా తాకడంతో భక్తులు దర్శించుకుని పులకించిపోయారు.



స్వామివారిని తాకిన భానుడి కిరణాలు

ఇవేం జ్వరాలు బాబోయ్?

- అంతుబట్టని లక్షణాలు
- నిర్లక్ష్యం చేయవద్దంటున్న వైద్యులు
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



ఆసుపత్రి వార్డులో జ్వరపీడితులు



ఇచ్ఛాపురం ఆస్పత్రిలో రోగులు

(ఇచ్ఛాపురం)

జిల్లాలో జ్వరాల తీవ్రత అధికంగా ఉంది. ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రులు జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. అయితే, ఇవి ఏ జ్వరాలో వైద్యులకు అంతుబట్టడం లేదు. జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు ఉంటే డెంగ్యూగా, శరీరంపై దద్దుర్లు ఉంటే గున్యాగా, తీవ్రమైన జ్వరం ఉంటే మలేరియా, టైఫాయిడ్ అని వైద్యులు ప్రాథమిక నిర్ధారణకు వస్తారు. అయితే, గత కొద్దిరోజులుగా జిల్లాలో వెలుగుచూస్తున్న జ్వరాలు మాత్రం వారిని గందరగోళానికి గురిచేస్తున్నాయి. వైరస్ కారణంగా జ్వరాలు వ్యాపిస్తున్నాయని చెబుతున్నా.. వ్యాధికారక వైరస్ మాత్రం ఏమిటనేది తెలియడం లేదు. జ్వరాలు శరీరంలో అన్ని అవయవాలపై ప్రభావం చూపుతుండడంతో భయపడిపోతున్నారు. గతంలో వచ్చిన వైరల్ జ్వరాలు మందులు వేసుకున్నా మూడు, నాలుగు రోజుల్లో తగ్గిపోయేవి. కానీ, ఇప్పుడు వస్తున్న జ్వరాల ప్రభావం 7 నుంచి 10 రోజుల వరకూ ఉంటోంది. మొదటి రోజే శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీలకు చేరుతోంది. ఇన్‌ఫెక్షన్ తీవ్రత చూపే సీఆర్పీ (సీరియాక్టివ్ ప్రొటీన్) త్వరగా పెరిగిపోతోంది. ప్లేట్‌లెట్ల సంఖ్య వేగంగా పడిపోతోంది. వీటిని నిర్లక్ష్యం చేయరాదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వెంటనే చికిత్స చేసుకోవాలని చెబుతున్నారు.

విపరీతమైన నీరసం..

జ్వరం వచ్చిన వారు వెంటనే నీరసించిపోతున్నారు. వికారం, నీళ్ల విరేచనాలు, కీళ్ల నొప్పులు, నీరసం, దగ్గు, గొంతునొప్పి, కళ్లమంటలు, ముక్కుకారడం, శరీరంపై దద్దుర్లు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం వేడిగా ఉండడంతో పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో ఏసీ వినియోగం అధికం. దీంతో వైరల్ జ్వరాలు వేగంగా విస్తరిస్తున్నాయి. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకూ జ్వరాలబారిన పడుతున్నారు. పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నవారు సైతం వీటి బారిన పడుతున్నారు. ప్రధానంగా గతంలో కరోనా బారిన పడినవారిలో తీవ్రత అధికంగా ఉంది.

పెరుగుతున్న రోగులు..

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రుల్లో ఒక్కసారిగా జ్వరపీడితులు పెరిగారు. సాధారణంగా రోజుకు వందల సంఖ్యలో ఉండే ఓపీ వేలకు పెరిగింది. అయితే ఆస్పత్రులకు వచ్చిన వారే మరోసారి వస్తుండడం జ్వరాల తీవ్రతను తెలియజేస్తోంది. ఈ ఏడాది ముందస్తు అంచనాల్లో వైద్య ఆరోగ్య శాఖ విఫలమైంది. ఇంటి పరిసరాల్లో నీటినిల్వలు పేరుకుపోయి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. కొందరిలో జ్వరం తగ్గుముఖం పట్టిన తరువాత తిరిగి రెండు మూడు రోజుల అనంతరం మళ్లీ వస్తోంది. వైరల్ జ్వరాలు కారణంగా రక్తనాళల్లో నీరు తయారవుతోంది. జ్వరం తగ్గగానే ఊపిరితిత్తుల్లోకి ఆ నీరు చేరుతోంది. దీనినే ప్లాస్మా లీకేజీ అంటారని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం జ్వరం వచ్చి తగ్గిన బాధి తులు ఈ సమస్యను ఎదుర్కొంటు న్నారు. జ్వరం తగ్గిన 45 గంటల వరకూ క్రిటికల్ ఫేజ్ సమయమం టారు. ఈ సమయంలోనే ఎక్కువ గా ఇబ్బందిపడుతున్న వారు ఆస్పత్రుల్లో చేరుతున్నారు.

వాస్తవమే

జ్వరాల తీవ్రత అధికంగా ఉన్న మాట వాస్తవమే. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో జ్వరాల తీవ్రత పెరుగుతోంది. వచ్చిన వారే మరోసారి ఆస్పత్రులకు వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. గతానికి భిన్నంగా జ్వరాలు పడిన వారిలో లక్షణాలు కనిపిస్తున్నాయి. వీలైనంత వరకూ వేడినీరు తాగాలి. ఇంటి పరిసరాల చుట్టూ శుభ్రతను పాటించాలి.

-డాక్టర్ పాతిర్ల దేవేంద్రరెడ్డి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్, ఇచ్ఛాపురం

దిక్సూచి DIKSUCHI

ఎన్‌ఐడీలో బీ డిజైన్



అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ)- బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆంధ్రప్రదేశ్ సహా అహ్మదాబాద్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో బీ డిజైన్ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. దీని వ్యవధి నాలుగేళ్లు. ఈ ప్రోగ్రామ్‌ను ఆంగ్ల భాషలో నిర్వహిస్తారు. డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (డీఏటీ) ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఇందులో ప్రిలిమ్స్, మెయిన్స్ దశలు ఉంటాయి. ప్రిలిమ్స్‌లో అర్హత పొందినవారిని మెరిట్ ప్రకారం షార్ట్‌లిస్ట్ చేస్తారు. ప్రతి కేటగిరీలో సీట్ల సంఖ్యకు మూడు రెట్లమందిని మెయిన్స్‌కు అనుమతిస్తారు. ప్రిలిమ్స్, మెయిన్స్ స్కోర్ ఆధారంగా తదుపరి అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తారు.

బీ డిజైన్

విభాగాలు: యానిమేషన్ ఫిల్మ్ డిజైన్, ఎగ్జిబిషన్ డిజైన్, ఫిల్మ్ అండ్ వీడియో కమ్యూనికేషన్, గ్రాఫిక్ డిజైన్, సిరామిక్ అండ్ గ్లాస్ డిజైన్, ఫర్నిచర్ అండ్ ఇంటీరియర్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్.

సీట్లు: అహ్మదాబాద్ క్యాంపస్‌లో 125 సీట్లు; ఆంధ్రప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 75 సీట్లు ఉన్నాయి. విదేశీ విద్యార్థుల కోసం అహ్మదాబాద్ క్యాంపస్‌లో 19 సీట్లు, మధ్యప్రదేశ్ క్యాంపస్‌లో 11 సీట్లు, హరియాణా క్యాంపస్‌లో 11 సీట్లు అదనంగా ఉన్నాయి.

అర్హత: అభ్యర్థులు 2004 జూలై 1 తరవాత జన్మించి ఉండాలి. సీబీఎస్ఈ/ఐబీ/ఐసీఎస్ఈ/ఇతర గుర్తింపు పొందిన బోర్డుల నుంచి 2024-25 విద్యా సంవత్సరం నాటికి సైన్స్, ఆర్ట్స్, కామర్స్, హ్యూమానిటీస్ గ్రూప్‌లతో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025లో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే. వీరు 2025 జూలై 15 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. నేషనల్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించే రెండేళ్ల 'జాయింట్ సర్వీసెస్ వింగ్ కోర్సు' ఉత్తీర్ణులు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్) నుంచి కనీసం అయిదు సబ్జెక్టులతో సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు; హెచ్ఎస్‌సీ ఒకేషనల్ ఎగ్జామ్ పాసైనవారు; బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహించే మూడేళ్ల డిప్లొమా కోర్సులు పూర్తిచేసినవారు; జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్(జీసీఈ) అడ్వాన్స్‌డ్ లెవెల్ ఎగ్జామ్(లండన్/శ్రీలంక) ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

డీఏటీ వివరాలు: ప్రిలిమ్స్‌ను పేపర్-పెన్సిల్/పెన్ విధానంలో నిర్వహిస్తారు. టెక్స్, విజువల్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష వ్యవధి వివరాలను అడ్మిట్‌కార్డ్‌లో తెలియజేస్తారు. మెయిన్స్ ఎగ్జామ్‌ను స్టూడియో సెటప్ ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. ఇందులో మల్టిపుల్ టెస్టులు ఉంటాయి. ప్రిలిమ్స్ స్కోర్‌కు 40 శాతం, మెయిన్స్ స్కోర్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.3,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500; విదేశీ విద్యార్థులకు రూ.5,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబరు 3
- **ఎడిట్ విండో ఓపెన్:** డిసెంబరు 4 నుంచి 9
- **ప్రిలిమ్స్ అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** డిసెంబరు 24 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ
- **ప్రిలిమ్స్ తేదీ:** 2025 జనవరి 5న
- **ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల:** బీ డిజైన్‌కు 2025 ఏప్రిల్ 1న.
- **వెబ్‌సైట్:** admissions.nid.edu

Tata Capital Pankh Scholarship Program

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.
Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.
Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less)
Last Date to Apply: 15-10-2024. ***Application mode:*** Online applications only.
Short Url: ww.b4s.in/aj/TCPS27

Santoor Scholarship Programme

Description: Santoor Scholarship Programme 2024-25 aims to support the undergraduate studies of young women from disadvantaged backgrounds in the states of Andhra Pradesh, Karnataka, Telangana or Chhattisgarh.
Eligibility: Open to young women from underprivileged backgrounds residing in Andhra Pradesh, Karnataka, Telangana, and Chhattisgarh.
Applicants must have: passed Class 10 from a local government school. passed Class 12 from a government school or junior college in the academic year 2023-24. And enrolled in a full-time graduate programme starting in 2024-25.
Note: • The full-time graduate course must have a minimum duration of 3 years.
• Students with a strong interest in pursuing higher education in humanities, liberal arts, and sciences, are strongly encouraged to apply. • Priority will also be given to students from aspirational (backward) districts.
Prizes & Rewards: INR 24,000 per annum
Last Date to Apply: 15-10-2024
Application mode: Online applications only! Students can apply online at Buddy4study or download the application form from www.santoorscholarship.com.
Short Url: www.b4s.in/aj/SWS7

SCHOLARSHIP ALERT

Sensodyne IDA Shining Star Scholarship Programme 2024-25

Description: Haleon India, makers of Sensodyne, invites applications for the 'Sensodyne IDA Shining Star Scholarship Programme 2024-25' to support meritorious and underprivileged BDS students across India.
Eligibility:
- Open to students pursuing their first year of the Bachelor of Dental Surgery (BDS) programme from government and government-funded colleges only.
- Applicants must have scored a minimum of 60% in their Higher Secondary Education.
- Successful applicants must maintain a 60% score in every semester/year to continue availing of the benefits during their 4-year course.
- The annual family income of the applicant from all sources must not be more than INR 8,00,000.

Prizes & Rewards: INR 4,20,000 for 4 years (INR 1,05,000 per year)
Last Date to Apply: 31-10-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SSPPS4

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి



నాని పక్కన కేజీఎఫ్ భామ

నాని నటిస్తున్న 32వ సినిమా 'హిట్.. ద థర్డ్ కేస్'. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కేజీఎఫ్ భామ శ్రీనిధి శెట్టి నటిస్తోంది. సినిమాలో ఆమె పాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉందని దర్శకుడు చెప్పారు. ప్రస్తుతం వైజాగ్‌లో జరుగుతున్న షూటింగ్‌లో శ్రీనిధి జాయిన్ అయింది. నాని, శ్రీనిధిపై కీలకమైన సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. వచ్చే ఏడాది మే ఒకటిన విడుదలయ్యే ఈ సినిమాను ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు.

క్రైమ్ క్యాన్సర్ లాంటిది.. పెరగనివ్వకూడదు

'వారంలో ఎన్‌కౌంటర్ జరిగిపోవాలి' అని రావు రమేశ్ అనగానే 'వారం అక్కర్లేదు.. మూడే రోజుల్లో డిపార్ట్‌మెంట్‌కు మంచి 'పేరొస్తుంది' అంటూ స్టయిలిష్ నడకతో ఎంట్రీ ఇచ్చారు రజనీకాంత్. ఆయన హీరోగా నటించిన 'వేట్టయన్.. ద హంటర్' సినిమా ఈ నెల పదిన విడుదల కానుంది. ఈ నేపథ్యంలో బుధవారం విడుదల చేసిన ట్రైలర్ ఆకట్టుకుంటోంది. అలాగే అమితాబ్, రానా, ఫాహద్ ఫాజిల్ పాత్రల్ని కూడా ఈ ట్రైలర్‌లో పరిచయం చేశారు. 'క్రైమ్ అనేది క్యాన్సర్ లాంటిది. దానిని పెరగనివ్వకూడదు' వంటి డైలాగులు, అద్భుతమైన విజువల్స్ అలరిస్తున్నాయి. 'నన్ను ఏ పోస్టులో తిప్పి కొట్టినా నేను మాత్రం పోలీస్ వాడినే సార్.. నా నుంచి వాడిని కాపాడడం ఎవరి వల్లా కాదు' అంటూ రజనీకాంత్ డైనమిక్‌గా చెప్పే డైలాగ్ ఈ సినిమా మీద అంచనాలు పెంచేసింది. మంజు వారియర్, రోహిణి, అభిరామి, రితికా సింగ్ ఇతర ముఖ్య పాత్రలు పోషించిన ఈ సినిమాను టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మించారు.

కోలుకుంటున్న రజనీకాంత్

● ఆయన ఆరోగ్యంపై ప్రధాని ఆరా

తీవ్ర అస్వస్థతకు గురై చెన్నై నగరంలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ క్రమంగా కోలుకుంటున్నారు. గురువారం డిశ్చార్జ్ అయ్యే అవకాశముందని ఆసుపత్రివర్గాలు వెల్లడించాయి. ఇంటికి చేరిన తర్వాత ఆయన వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాల్సివుంటుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఇదిలావుండగా.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రజనీ ఆరోగ్యం గురించి ఆయన సతీమణి లతా రజనీకాంత్‌కు ఫోన్ చేసి వాకబు చేశారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)



శ్వాగ్ లాంటి సినిమా తీయడం కష్టం



'రాజ రాజ చోర' ఫేమ్ హసిత్ గోలి దర్శకత్వంలో శ్రీవిష్ణు, రీతూ వర్మ నటించిన చిత్రం 'శ్వాగ్'. టీ.జీ.విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీవిష్ణు మాట్లాడుతూ "ఇది చాలా పెద్ద కథ. ఇలాంటి కథను తెరకెక్కించడం అంత ఈజీ ఏం కాదు. ఇందులో నాలుగు పాత్రలు పోషించాను. హసిత్ ఈ సినిమాను చాలా బాగా హ్యాండిల్ చేశారు" అని చెప్పారు. "గూఢచారి', 'బేబీ' 'కార్తికేయ' వంటి సినిమాల్లా.. మార్కెట్ కంటే ఎక్కువ స్పాన్ ఉన్న చిత్రం 'శ్వాగ్. కచ్చితంగా ఘనవిజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది" అని నిర్మాత టీ.జీ.విశ్వప్రసాద్ అన్నారు. "నిర్మాత విశ్వప్రసాద్ మేకింగ్ విషయంలో పూర్తి స్వేచ్ఛనిచ్చారు. శ్రీవిష్ణు కథను హీరోగా భావించే సినిమా చేసే గొప్ప నటుడు" అని డైరెక్టర్ హసిత్‌గోలి చెప్పారు. "ఇందులోని ప్రతీ పాత్ర కొత్తగా ఉంటుంది. సినిమా అందర్నీ ఆకట్టుకుంటుంది" అని హీరోయిన్ రీతూ వర్మ తెలిపారు.

'గాంధీ' కోసం రెహమాన్ సంగీతం



బాలీవుడ్ డైరెక్టర్ హన్సల్ మెహతా దర్శకత్వంలో మహాత్ముడి జీవితం ఆధారంగా 'గాంధీ' సిరీస్ తెరకెక్కుతోంది. గాంధీ జయంతి సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన ఓ కీలక అప్‌డేట్‌ను చిత్రబృందం షేర్ చేసుకుంది. ఈ సినిమాకు ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తున్నారని ప్రకటించింది. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ 'దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీ జీవిత కథను ఈ సిరీస్ స్ఫూర్తిదాయక రీతిలో ప్రజెంట్ చేస్తుంది. అటువంటి గొప్ప పోరాట యోధుడి బయోపిక్‌కు సంగీతం అందించటం ఆనందంగా ఉంది" అని అన్నారు. ప్రముఖ చరిత్రకారుడు రామచంద్రన్ గుహ రాసిన 'గాంధీ బిఫోర్ ఇండియా' పుస్తకం ఆధారంగా ఈ సిరీస్ తెరకెక్కుతోంది. అప్లాజ్ ఎంటర్టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది.

ఇన్ ప్రోగ్రెస్

విలన్ ఎవరనేది సస్పెన్స్



'మిస్టర్ సెలెబ్రిటీ' చిత్రంతో పరుచూరి వెంకటేశ్వరరావు మనవడు సుదర్శన్ హీరోగా పరిచయమవుతున్నారు. రవికిశోర్ దర్శకత్వంలో చిన్న రెడ్డయ్య, ఎన్. పాండురంగారావు ఈ సినిమాను నిర్మించారు. ఈ నెల నాలుగున విడుదలవుతున్న ఈ సినిమా ట్రైలర్‌ను రానా విడుదల చేసి, సుదర్శన్‌కు అభినందనలు తెలిపారు. సస్పెన్స్ జానర్‌లో రూపుదిద్దుకున్న ఈ సినిమాలో విలన్ ఎవరన్నది తెలియకుండా ట్రైలర్‌ను కట్ చేసిన విధానం దర్శకుని ప్రతిభను విదితం చేసింది. వరలక్ష్మి శరత్‌కుమార్, శ్రీదీక్ష, నాజర్, రఘుబాబు తదితరులు నటించారు.

ప్రేక్షకులు మెచ్చే ప్రేమకథ



శ్రీనివాస్ మహత్ దర్శకత్వంలో చంద్రహాస్ హీరోగా నటించిన చిత్రం 'రామ్‌నగర్ బన్నీ'. మలయజ ప్రభాకర్, ప్రభాకర్ పొడకండ నిర్మిస్తున్నారు. ఈ నెల 4న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు రామ్‌గోపాల్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'రామ్‌నగర్ బన్నీ' ప్రచార చిత్రాలతో సినిమాపై ఆసక్తి పెరిగింది. చంద్రహాస్ హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకోవాలి' అని ఆకాంక్షించారు. మా టీం అంతా ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు అని దర్శకుడు చెప్పారు. ప్రేక్షకులు 'రామ్‌నగర్ బన్నీ' చిత్రాన్ని ఆదరించాలని ప్రభాకర్ కోరారు. ప్రేక్షకులను ఆకట్టుకునే వినోదంతో పాటు మంచి ప్రేమకథ ఉన్న చిత్రమిది, ప్రేక్షకులను మెప్పిస్తుందని చంద్రహాస్ చెప్పారు.

దీక్ష.. పట్టుదల



కిరణ్‌కుమార్, అలేఖ్యా రెడ్డి జంటగా నటించిన 'దీక్ష' చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ దర్శకత్వంలో పినిశెట్టి అశోక్‌కుమార్ నిర్మిస్తున్నారు. 'దీక్ష, పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలం అనే పాయింట్‌తో చిత్రాన్ని తీశాం. హీరోగా కిరణ్‌కు ఎంతో పేరు తెచ్చే సినిమా ఇది. రాజ్‌కిరణ్ స్వరపరిచిన పాటలు ఆకట్టుకుంటాయి. మంచి కంటెంట్‌తో రూపొందిన ఈ సినమా అందరినీ ఆకట్టుకుంటుంది. మా నిర్మాత అశోక్‌కుమార్‌గారు వెనుకుండి మమ్మల్ని నడిపిస్తున్నారు' అని చెప్పారు సినిమాలో ఐటెం సాంగ్ చేసిన అక్సాఖాన్ మాట్లాడుతూ 'ఇందులో అవకాశం ఇచ్చిన దర్శకనిర్మాతలకు కృతజ్ఞతలు. ఈ సినిమాతో పాటు 16 భాషల్లో వస్తున్న 'మహిళా కబడ్డీ' సినిమాలోనూ ఆర్ కె గౌడ్ అవకాశం ఇచ్చారు' అని తెలిపారు.

ట్వల్త్ ఫెయిల్‌కు ప్రీక్వెల్



విధువినోద్ చోప్రా దర్శకత్వంలో తెరకెక్కిన 'ట్వల్త్ ఫెయిల్' బయోపిక్ ప్రేక్షకుల నుంచి ఎంతటి ఆదరాభిమానాలను అందుకుందో తెలిసిందే. విక్రాంత్ మస్సే ఇందులో ఐ.ఏ.ఎస్ ఆఫీసర్ మనోజ్ కుమార్ శర్మగా.. కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు. తాజాగా, జరిగిన ఓ మీడియా సమావేశంలో.. 'ట్వల్త్ ఫెయిల్ సినిమాకు ప్రీక్వెల్‌గా తెరకెక్కుతోన్న 'జీరో సే రీస్టార్ట్' సినిమాను డిసెంబరు 13న విడుదల చేయనున్నట్లు విధువినోద్ చోప్రా ప్రకటించారు. "మొదటి భాగంలో ఉన్న నటీనటులే ఇందులోనూ కొనసాగుతారు. ఈ ప్రీక్వెల్ కథానాయకుడి బ్యాక్ స్టోరీపై ఫోకస్ చేస్తుంది. ఇందులో మనోజ్ కుమార్ జీవితాన్ని మార్చేసిన సంఘటనలను ఆసక్తికరంగా చూపించనున్నాం" అని చెప్పారు.

ఆ నేపథ్యంలో ఎవరూ చేయని సినిమా



'కరోనా సమయంలో ఆత్మహత్యలు చేసుకొనే వారి సంఖ్య పెరిగింది. అలాంటి ప్రయత్నం చేసినప్పుడు ఎవరైనా అడ్డుకుని వారిని ఆ ఆలోచనకు దూరం చేస్తే బాగుంటుంది.. అనే పాయింట్‌తో దర్శకుడు శివశేష రాసుకున్న కథ విన్నప్పుడు నాకు కొత్తగా అనిపించింది. ఇలాంటి నేపథ్యంలో ఎవరూ సినిమా చేయలేదనిపించి, నా సమర్పణలో 'కలి' చిత్రాన్ని నిర్మించాం' అన్నారు సీనియర్ జర్నలిస్టు రాఘవేంద్రరెడ్డి. ప్రిన్స్, నరేశ్ అగస్త్య హీరోలుగా నటించిన 'కలి' చిత్రం ఈ నెల నాలుగున విడుదల కానుంది. లీలా గౌతమ్ నిర్మాత. ఈ నేపథ్యంలో రాఘవేంద్రరెడ్డి చిత్ర విశేషాలను మీడియాకు వెల్లడిస్తూ 'శివరామ్ అనే మంచి వ్యక్తి తన జీవితంలో ఎదురైన కొన్ని ఇబ్బందుల వల్ల ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటాడు. ఆ సమయంలో ఒక అపరిచిత వ్యక్తి అతని ఇంటికి వస్తాడు. అతని రాకతో శివరామ్ జీవితం ఎలా మారింది అనేది 'కలి' కథ. ఎలాంటి సందేశాలు, ఉపోద్ఘాతాలు లేకుండా సినిమా తీశాం. నిర్మాణపరంగా ఎక్కడా రాజీపడలేదు.. ఇందులో బల్లి పాత్రకు ప్రియదర్శి, గోడ గడియారంకు అయ్యప్ప పి.శర్మ డబ్బింగ్ చెప్పారు' అని చెప్పారు రాఘవేంద్రరెడ్డి. దర్శకుడు శివ శేష ప్రతిభావంతుడనీ, పురాణాల మీద మంచి పట్టు ఉందని తెలిపారు. సినిమా మేకింగ్ మీద ప్యాషన్‌తో లీలా గౌతమ్ వర్మ నిర్మాణరంగంలోకి వచ్చారనీ, నిర్మాతగా అతనికి మంచి భవిష్యత్ ఉంటుందని రాఘవేంద్రరెడ్డి చెప్పారు.

వరికి తెగుళ్ల పోటు

● ఆందోళన చెందుతున్న రైతులు

నరసన్నపేట

ఇటీవల వాతావరణంలో వస్తున్న మార్పులతో వరి పైరుకు తెగుళ్ల బెడద ఎక్కువైంది. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. నరసన్నపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పోలాకి, జలుమూరు, సారవకోట, నరసన్నపేట మండలాల్లో సుమారు 1800 ఎకరాల్లో తెగుళ్లు సోకాయి. సుందరాపురం, పారశిల్లి, మామిడివలస, జమ్ము, తామరాపల్లి, జలుమూరు, కూర్మ నాథపురం, గుగ్గిలి, రామయ్యవలస, జోనంకి, వెంకటాపురం, ఊడికలపాడు ప్రాంతాల్లో వరి పైరును కాండం తొలిచే పురుగు, ఆకు తొలిచే పురుగు, బూజు తెగుళ్లతో వాటి నివారణకు రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా స్వర్ణ, సాంబ రకాలకు ఈ తెగుళ్లు సోకినట్లు రైతులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి తగు సూచనలు ఇవ్వాలని రైతులు వ్యవసాయాధికారులను కోరుతున్నారు. దీనిపై ఏడీఏ రవీంద్రభారతి వద్ద ప్రస్తావించగా.. అగ్గితెగులు సోకే వరి రేకుపై నూలికండి ఆకారంలో తుప్పుమచ్చలు ఏర్పడి చేను ఎరుపుగా మారుతుందన్నారు. దీని నివారణకు ట్రైసైక్లోజోల్ 1.6 గ్రాముల మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కుళ్లు తెగులు సోకిన వరి పైరుపై ఇతోఫినొపాస్ లేదా హెసిఫేటు 2 గ్రాముల మందును ఒక లీటరు నీటిలో కలిపి దుబ్బు మొదళ్లపై పడేలా పిచికారీ చేయాలన్నారు.



వరి పంటకు తెగులు సోకకుండా మందును పిచికారీ చేస్తున్న రైతు



జలుమూరు : వరి పొలంలో కేళీ దుబ్బులు తొలగిస్తున్న కూలీలు

వరిలో కేళీలతో బేజారు..

జలుమూరు: ఈ ఏడాది వరి సాగులో కేళీలు అధికంగా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలంలో కేళీలు అధికంగా కనిపిస్తుండడంతో పంట దిగుబడి తగ్గి తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఏపీసీడ్స్‌లో విత్తనాలు కొనుగోలు చేసి వాటిని రెండు, మూడు పర్యాయాలు విత్తనాలుగా తయారుచేసి పంటలు వేస్తుంటారు. రైతులు తయారు చేసుకొనే విత్తనాల్లో కేళీలు కలిసి చిరుపొట్ట దశకు చేను వచ్చేసరికి కేళీలు దుబ్బులుగా కనిపిస్తాయి. వీటిని తొలగించకుంటే దిగుబడి తగ్గి తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. చిరుపొట్ట దశలో కేళీ దుబ్బులు తొలగించేందుకు మదుపు ఎక్కువవుతుందని ఆవేదన చెందుతున్నారు. అలాగే కేళీలు తొలగించేసమయంలో వరిచేను తొక్కడం వల్ల చిరుపొట్ట దెబ్బతిని నష్టం వాటిల్లుతుందని రైతులు పేర్కొంటున్నారు. కేళీలు తొలగించేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోండి

నరసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం విధానం ప్రకారం నరసన్నపేట, పోలాకి మండలాల్లో 12 దుకాణాల లైసెన్సు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ రమణ, ఎస్ఐ గురుమూర్తి కోరారు. ఈ మేరకు బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. నరసన్నపేట మండలంలో 8, పోలాకి మండలంలో 4 దుకాణాలు కేటాయించిందన్నారు. ఒక దుకాణానికి ఫీజు రూ.2 లక్షలు చెల్లించాలన్నారు. లాటరీ ద్వారా దుకాణాలను ఈనెల 11న కేటాయిస్తారన్నారు. మొదటి ఏడాదికి రూ.65 లక్షలు, రెండో ఏడాది రూ.71.5 లక్షలు లైసెన్సు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 9వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పదో తరగతి హిందీ సిలబస్ తగ్గింపుపై హర్షం

పోలాకి: రాష్ట్రంలో పదో తరగతి హిందీ సిలబస్‌లో 7 పాఠ్యాంశాలు తగ్గించడంపై శ్రీకాకుళం హిందీ ఫోరం, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా శాఖలు హర్షం వ్యక్తం చేశాయి. హిందీ పాఠ్యాంశాల భారం తగ్గింపుతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎంతో ఉపకరిస్తుందన్నారు. సంఘాలు ఇచ్చిన వినతిపై స్పందించి చర్యలు తీసుకున్న మంత్రి నారా లోకేష్‌కు రాష్ట్ర పండిత పరిషత్ కౌన్సిలర్ జి.వీరాస్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఎలిమెంటరీ తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేసిన జీవోను రద్దు చేయాలని కోరారు. 177 జీవో రద్దు, హిందీపండితుల శిక్షణకు నోటిఫికేషన్ విడుదల చేయాలని సంబంధిత మంత్రులకు, అధికారులకు పండిత పరిషత్ తరఫున లేఖ రాశామని ఆయన పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ అమావాస్య

నందిగాం: మండలంలో పలు గ్రామాల్లో బుధవారం పోలేరమ్మ అమావాస్య సందర్భంగా మహిళలు వ్రతాన్ని ఆచరించారు. పోలేరమ్మకు అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టారు. అనంతరం ప్రసాదాన్ని పంచిపెట్టారు. ● పలాస రూరల్: బ్రాహ్మణతర్లా, పండాశాసనం, రెంటికోట గ్రామాల్లో బుధవారం పోలేరు అమావాస్య సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పితృదేవతలకు పిండి వంటలు సమర్పించి వరి దుబ్బుకు ప్రత్యేక పూజలు చేపట్టారు.

గొల్లూరులో చెత్తసేకరణ కేంద్రం ప్రారంభం

నందిగాం: గొల్లూరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం సర్పంచ్ జీరు రాజేశ్వరి, నానీరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీవో టి.రాజారావు ప్రారంభించారు. దీనిని వినియోగించి పంచాయతీకి అదనపు ఆదాయం తీసుకురావాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకర వాతావరణం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముదిలి సింహాచలం, స్వచ్ఛత మండల కన్వీనర్ ఎ.రాంబాబు, కార్యదర్శులు ఎస్.చంద్రశేఖర్, తిరుపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

టెక్కలి: ధ్యానంతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని ఆనందరీష్ ఫౌండేషన్ ఉపన్యాసకులు విజయానంద్ గురూజీ అన్నారు. బుధవారం స్థానిక బీఎస్‌జేఆర్ కళాశాల ఆవరణలో ధ్యానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధ్యానం నిత్య జీవితంలో భాగం కావాలన్నారు. ధ్యానం వల్ల శారీరక, మానసిక బలం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కోత మురళీధర్, మోదుగువలస దుర్యోధనరావు, కోత శ్రీనివాస్, శివరామరాజు, అల్లు నగేష్, బ్రహ్మానందం, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భావనపాడు తీరంలో స్వచ్ఛతా హీ సేవ

సంతబొమ్మాళి: నెహ్రూ యువ కేంద్ర అధ్వర్యంలో భావనపాడు సముద్రతీరంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తీరం శుభ్రంగా ఉంటే పర్యాటకులు సందర్శిస్తారని ఎన్‌వైకే వలంటీర్లు కొయ్యాన మధు, రేవతి అన్నారు. తీరాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం అవసరం

టెక్కలి: ప్లాస్టిక్ రహిత సమాజం అవసరమని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా కె.కొత్తూరు గ్రామంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్వచ్ఛత హీ సేవా ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఐతం విద్యార్థులు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి సేంద్రియాల వైపు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో మారుతీ ప్రసాద్, చీఫ్ వార్డెన్ డాక్టర్ జయమన్మథరావు, ఎంవీ రమణయ్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఇంటిబాట

నందిగాం: పాఠశాలలు, కళాశాలలకు గురువారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించడంతో నందిగాం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులు బుధవారం ఇంటిబాట పట్టారు. మూడు నెలలుగా గురుకులానికి పరిమితమైన విద్యార్థినులు దసరా సందర్భంగా తల్లిదండ్రులతో కలిసి ఇళ్లకు బయలుదేరి వెళ్లారు. ప్రిన్సిపాల్ ఎన్.వాణి, సూపరింటెండెంట్ లక్ష్మి, ఉపాధ్యాయినుల నేతృత్వంలో ముందస్తు దసరా వేడుకలు నిర్వహించారు.



గురుకులం నుంచి బయలుదేరిన విద్యార్థినులు

దీర్ఘకాలిక వ్యాధి బాధిత కుటుంబానికి సాయం

నరసన్నపేట: స్థానిక మారతీనగర్-8లో అనారోగ్యంతో బాధపడుతున్న హనుమంతు సింహాచలం కుటుంబానికి కాళింగ సంక్షేమ సంఘం రూ.83 వేలు నగదును బుధవారం అందించారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నందున వైద్యచికిత్స కోసం ఈ సాయం అందించినట్లు సంఘ నాయకుడు పూర్ణారావు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రోణంకి కృష్ణంనాయుడు, మార్పు విజయ్, సువ్వారి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు. ● టెక్కలి: నర్సింగపల్లి గ్రామానికి చెందిన ఓ క్షయవ్యాధి గ్రస్థునికి నర్సింగపల్లి సేవా సంఘం ప్రతినిధులు బుధవారం రూ.30,300 సాయం అందించారు. ఎన్ని షణ్ముఖరావు, పాపారావు, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనంలోకి నాగుపాము

వజ్రపుకొత్తూరు: మహాదేవపురం అంగన్‌వాడీ భవనంలోకి బుధవారం నాగుపాము కనిపించడంతో గ్రామస్థులు ఆందోళన చెందారు. గాంధీ జయంతి సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి సెలవు కావడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొంటున్నారు. భవనం బీటలు వారడంతో తరచూ భవనంలోకి పాములు ప్రవేశిస్తున్నాయని స్థానికులంటున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు Ms. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, టెక్కలి బ్రాంచి వారి భోగట్టాపై ఇవ్వున్న పబ్లిక్ నోటీసు. శ్రీకాకుళం జిల్లా, నందిగాం మండలం, కాపుతెంబూరు గ్రామ కాపురస్థులైన శ్రీ/శ్రీమతి [illegible] [illegible] సర్వే నెం. 21-9, [illegible] డోర్ నెం. 14-667 [illegible] నెం. 5414 [illegible] 1134004746 [illegible] 131/4 అడుగులు (4.115 మీ.) [illegible] 80 అడుగులు (24.384 మీ.) 118 [illegible] (30.24 చ.మీ.) [illegible] 131/4 అడుగులు (4.115 మీ.) [illegible] 57 అడుగులు (17.363 మీ.) 756 [illegible] (70.560 చ.మీ.) [illegible] 5.5 అడుగులు (1.67 మీ.) [illegible] 8.5 అడుగులు (2.592 మీ.) 47 [illegible] (4.38 చ.మీ.) [illegible]

Yavvari Hema kumar
Advocate, Palasa. Cell:9440592204

దుబాయ్‌లో మత్స్యకారుడి మృతి

● స్వగ్రామంలో అంత్యక్రియలు



అప్పన్న (ఫైల్)

సంతబొమ్మాళి: జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లి అక్కడే మృతి చెందిన భావనపాడు గ్రామానికి చెందిన పోతుమాల అప్పన్న (37) అంత్యక్రియలు బుధవారం స్వగ్రామంలో నిర్వహించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అప్పన్న దుబాయ్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. గత నెల 5న గ్యాస్ కటింగ్ పనులు చేస్తూ భవనం పైనుంచి ప్రమాదవశాత్తు జారి పడి అక్కడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గత నెల 19న మృతి చెందాడు. అప్పన్న మృత దేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు గాను గ్రామస్థులు కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. వారు విదేశీ మంత్రిత్వ శాఖాధికారులతో మాట్లాడి 12 రోజుల్లోనే గ్రామానికి తీసుకువచ్చేలా కృషి చేశారు. దీంతో మృతదేహం గ్రామానికి రాగా కుటుంబ సభ్యులు అంత్యక్రియలు చేపట్టారు. అప్పన్న నిరుపేద మత్స్యకారుడని, ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిఅక్కడ పనులు చేస్తూ మృతి చెందాడని, అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. మృతుడికి భార్య ధనలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గాంధీ ఆశయాలను నెరవేర్చాలి



పలాసరూరల్: జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ నెరవేర్చాలని వక్తలు అన్నారు. బ్రాహ్మణతర్లా బజారు కూడలిలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం గాంధీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. స్వాతంత్ర్య సముపార్జనలో గాంధీ అనుసరించిన అహింసా సిద్ధాంతం ఆచరణీయమన్నారు. నడిమి వీధిలో సప్పటి కామలింగం ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి దువ్వాడ సంతోష్ కుమార్ నాయుడు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఆళ్ల వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి వడ్డి యాదగిరి, మాజీ ఎంపీటీసీ గరుగు సింహాచలం, ఉపాధ్యక్షుడు ఆనందరావు, రఘుపాత్రుని సుదర్శనరావు, ఆళ్ల కృష్ణారావు, వైశ్య సంఘం పెద్దలు వి.కృష్ణమోహన్, వి.రత్నాకర్ పాల్గొన్నారు.

గాంధీ మార్గాన్ని ఎంచుకోవాలి

మెళియాపుట్టి: ప్రతిఒక్కరూ గాంధీ మార్గాన్ని ఎంచుకోవాలని నలంద పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జేజేఎస్ ప్రతాప్ అన్నారు. బుధవారం పాఠశాల ప్రాంగణంలో గాంధీ జయంతిని నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మురళి పాత్రో, శారద, జి.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి చర్యలు: మంత్రి అచ్చెన్న

కోటబొమ్మాళి: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం సౌడాం గ్రామంలో పర్యటించి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడచిన ఐదేళ్లలో అప్పటి సీఎం జగన్ రూ.12 లక్షల కోట్లు అప్పులు చేశారని, అందులో మూడు లక్షల కోట్లు బటన్‌నొక్కి డబ్బులు పంచానని చెప్పారన్నారు. మిగిలిన 6 లక్షల కోట్లు వైసీపీ నాయకుల జేబుల్లోకి వెళ్లాయని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పట్ట సింహాచలం, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రీడాశక్తిని పెంపొందించుకోవాలి: రామ్మోహన్

యువత క్రీడాశక్తి పెంపొందించుకోవాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. కొత్తమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి వివిధ క్రీడా పోటీలను పరిశీలించారు. సంప్రదాయ క్రీడలను పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, టీడీపీ నేతలు కింజరాపు హరిప్రసాద్, బోయిన గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు. ● కొత్తమ్మతల్లి జాతరలో భాగంగా రెండో రోజు బుధవారం కొతమ్మతల్లిని జనసేన నాయకులు దర్శించుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. విజయనగరానికి చెందిన కోయి డాన్సులు, పగటి వేషాలు ఆకట్టుకున్నాయి.

ఇలా ఉంటే అనారోగ్యం రాదా?



రోడ్డుపైకి వచ్చిన మురుగునీటిని చూపిస్తున్న కాంగ్రెస్ నాయకులు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ కండ్రవీధిలో రోడ్లపై మురుగునీటి ప్రవాహంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్లమెంటరీ ఇన్‌చార్జి పేడాడ పరమేశ్వరరావు, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు కోత మధుసూదనరావు తదితరులు కండ్రవీధిలో పర్యటించారు. పారిశుధ్య పనులు దారుణంగా ఉన్నాయని, ఇలా రోడ్లపైనే మురుగు నీరుంటే ప్రజలు ఎలా రాకపోకలు సాగిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొట్నూరు ఆనందరావు, శంకర్ ప్రసాద్, ప్రభుదేవా, వెంకట్రావు, జోగారావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. బుధవారం రాజపురంలో రైతులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి మాధవీలత, టీడీపీ నేతలు బి.రమేష్, కృష్ణారావు, చిన్నబాబు, హిమాచలం, సంతోష్ పాల్గొన్నారు. ● ఇచ్ఛాపురం: గాంధీ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను లొద్దపుట్టి గ్రామస్థులు బుధవారం సత్కరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చెత్త తొలగిస్తున్న న్యాయాధికారి తదితరులు

ఇచ్ఛాపురం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఫరీష్ కుమార్ అన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా బుధవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో కలిసి చెత్తలను తొలగించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.రమణయ్యరెడ్డి, న్యాయవాదులు ఆర్.దేవరాజ్‌రెడ్డి, దక్కత కృష్ణమూర్తిరెడ్డి, నాగరాజు పాత్రో, బైరాగిరెడ్డి, ప్రహ్లాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు చర్యలు

● వైసీపీ పాలన ఛిన్నాభిన్నం
● కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు
● జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి: మంత్రి అచ్చెన్న



వసతి గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు రామ్మోహన్, అచ్చెన్నాయుడు, చిత్రంలో కలెక్టర్ పుండ్కర్, ఎమ్మెల్యే ఎంజీఆర్

పాతపట్నం అక్టోబరు 2: జిల్లాలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, తన మార్క్ కనిపించేలా జిల్లాలో అభివృద్ధి చేసి చూపెడతానని కేంద్ర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. బుధవారం కోదూరు పంచాయతీలో రూ.2.30 కోట్లతో నిర్మించనున్న పీఎం జన్‌మన్ వసతి గృహానికి శంకుస్థాపన చేశారు. ఆలాంధ్రరోడ్ కూడలి సమీపంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు స్థల సేకరణకు కృషి చేస్తున్నామన్నారు. ఒక రంగంలో అభివృద్ధి జరిగితే దానికి అనుసంధానంగా పలు అభివృద్ధి పనులు జరుగుతాయని, ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వలసల నివారణకు దోహదపడుతుందన్నారు. విశ్రాంత ఆర్మీ ఉద్యోగుల కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నామన్నారు. వైసీపీ హయాంలో పాలన అంతా ఛిన్నాభిన్నమైందని, దీనిని చక్కదిద్దేందుకు సీఎం చంద్రబాబు నాయుడు శ్రమిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. జిల్లాను సమగ్రాభివృద్ధి చేస్తామన్నారు. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖలతో రాష్ట్రంలో 80 శాతం ప్రజానీకానికి సేవచేసే అవకాశం తనకు కలిగిందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన ప్రతీహామీని అమలు చేస్తామన్నారు. పాతపట్నం నియోజక వర్గం అత్యంత వెనుకబడినందున ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. జనమన్ వసతి గృహాలు రెండు ఈ నియోజకవర్గంలోనే ఏర్పాటు చేయనున్నామన్నారు. ఎన్నికల హామీలో భాగంగా జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో మూలపేటలో పోర్టు ఏర్పాటు చేసి ఏడాదిలో నౌకలు చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనివల్ల ఉపాధి అవకాశాలు పెరిగి నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతుందన్నారు. పాతపట్నంలో ఐటీడీఏ ఏర్పాటు, 50 పడకల ఆసుపత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చారు. చేనేత దుస్తులపై ఉన్న జీఎస్టీ తొలగించే దిశలో కేంద్రం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి మంత్రులతో పాటు కలెక్టర్ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, వివిధ శాఖల అధికారులు, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏర్పాట్లలో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం

పాతపట్నం: పాతపట్నంలో బుధవారం కేంద్ర, రాష్ట్ర మంత్రుల పర్యటన నేపథ్యంలో ఏర్పాట్ల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహించడంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పీఎంజన్‌మన్ హాస్టల్ భవనాల శంకుస్థాపన కార్యక్రమం చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే తహసీల్దార్ కార్యాలయం నుంచి శంకుస్థాపన స్థలం వరకు పరిశుభ్రత విషయంలో, సీసీ రోడ్డుకు ఇరువైపులా పొదలు తొలగించడంలో నిర్లక్ష్యం వహించారంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణం బాధ్యులైన పంచాయతీ కార్యదర్శి, ఈవోపీఆర్డీలకు నోటీసులు జారీ చేయాలని టెక్కలి ఆర్డీవో సుదర్శన్ దొరకు కలెక్టర్ ఆదేశించారు.

పారిశుధ్యలోపంపై అసంతృప్తి

నరసన్నపేట: స్థానిక జమ్ము జంక్షన్ వద్ద పారిశుధ్య లోపంతో ఉన్న పరిస్థితిని గమనించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. బుధవారం పాతపట్నంలో నిర్వహించిన కార్యక్రమానికి వెళుతున్న కలెక్టర్ మార్గ మధ్యంలో జమ్ము జంక్షన్ వద్ద ఉన్న నెలకొన్న పరిస్థితిని చూసి వెంటనే ఎంపీడీవో మధుసూదనరావుకు ఫోన్ చేసి పారిశుధ్య నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆయన ఆదేశాలతో పంచాయతీ సిబ్బంది పరిశుభ్రం చేశారు.

భారీ స్థాయిలో దుర్గా నవరాత్రులు

● నేటి నుంచి ఉత్సవాలు



పలాస లేబర్ కాలనీలో ఏర్పాటు చేసిన సెట్



టెక్కలి: అమ్మవారి విగ్రహాలను తీసుకువెళ్తున్న దృశ్యం

పలాస: దుర్గా నవరాత్రి ఉత్సవాలను భారీ స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పలాస పట్టణంలో లేబర్ కాలనీలో ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే ఎన్నడూ చేయని విధంగా నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. అయోధ్య రామాలయ నమూనాను తలపించేలా హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోస్‌కు చెందిన కళా దర్శకులు దీనిని రూపొందించారు. విగ్రహాలను కోల్‌కతాకు చెందిన శ్యామ్ సుందర్ తదితర కళాకారులు తయారు చేశారు. 18 అడుగుల ఎత్తు, 30 అడుగుల వెడల్పుతో దుర్గా, లక్ష్మి, సరస్వతి, వినాయకుడు, కుమారస్వామి విగ్రహాలను తయారయ్యాయి. ఈ ఉత్సవాలను గురువారం నుంచి నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. స్థానికుడు జ్యోతుల కృష్ణ వ్యయమంతా భరిస్తున్నారు. జంట పట్టణాల వాసులకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు

అష్టాదశ శక్తిపీఠాలతో ఉత్సవాలు

టెక్కలి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో స్వామి వివేకానంద యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో అష్టాదశ శక్తిపీఠాలతో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు భవానీ తెలిపారు. గురువారం నుంచి విజయదశమి వరకు వేద పండితుడు సుధీర్ శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆమె కోరారు.

ఘనంగా మెహర్‌బాబా మందిర వార్షికోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: కత్తెరవీధిలో ఉన్న మెహర్ బాబా మందిర వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సంకీర్తన, బాబాకి ప్రత్యేక అలంకరణ, పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వాహకులు భాస్కరరావు, శ్రీనివాసరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

జనం మెచ్చిన నేత నవీన్ పట్నాయక్

ఒడిశా

పర్లాకిమిడి: జనం మెచ్చిన నేత నవీన్ పట్నాయక్ అని పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్‌కుమార్ పాణిగ్రాహి అన్నారు. బుధవారం బీజేడీ నాయకులు గోసాని సమితి లావణ్యగడ గ్రామం నుంచి జనసంపర్క పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నవీన్ పట్నాయక్ జనం నుంచి వచ్చిన నేత అని, 24 ఏళ్ల పాలనలో ప్రజలు మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు జోగబందుదాస్, యువజన అధ్యక్షుడు ఎస్.లింగరాజు, గుసాని సమితి అధ్యక్షుడు వీరరాజు, కాసీ నగర్ అధ్యక్షుడు బల్ల సాయమ్మ పాల్గొన్నారు

ఆటోబోల్తా.. తొమ్మిది మందికి గాయాలు

బూర్జ: పాలకొండ పట్టణంలోని చెక్‌పోస్టు జంక్షన్ వద్ద బుధవారం ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో తొమ్మిది మందికి గాయపడ్డారు. ఆటోలో ఉన్నవారంతా బూర్జ మండలం డొంకలపర్త గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. 108 సాయంతో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్ వ్యాపారులకు రక్షణ కల్పించండి



ఎమ్మెల్యే శంకర్‌కు వినతి పత్రం అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో హోటల్, కల్యాణ మండపాల వ్యాపారులపై వరసదాడులు జరుగుతున్నాయని, రౌడీల నుంచి తాగుబోతుల నుంచి రక్షణ కల్పించాలని అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మెట్ట నాగరాజు కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను పలు హోటల్స్, కల్యాణ మండపాల నిర్వాహకులతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంగా వరుసగా తమ వ్యాపారులపై దాడులు జరుగుతున్నాయని, మంగళవారం సాయంత్రం స్థానిక 80 అడుగుల రోడ్డులో గల ఓ కల్యాణ మండపం మేనేజర్ ధనుంజయ్‌పై ఓ వ్యక్తి దాడికి పాల్పడడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. మూడు రోజుల కిందట రామలక్ష్మణ కూడలిలో ఉన్న ఓ హోటల్‌లో మద్యం తాగిన ఓ వ్యక్తి సిబ్బందిపై దుర్భాషలాడి ఫర్నీచర్ ధ్వంసం చేశాడని, దీనిపై కూడా రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. దాడులకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో వివిధ హోటల్స్, కల్యాణ మండపాల నిర్వాహకులు నక్క రామరాజు, గోపి, సుదర్శన్, సతీష్, రాజా, మాధవి, అంధవరపు తిరుమల, టంకాల కృష్ణ తదితరులు ఉన్నారు.

వేడుకగా నగర సంకీర్తన



వెంకటేశ్వర స్వామి చిత్రపటంతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సనాతన ధర్మ పరిరక్షణ కోసం చేపట్టిన 11రోజుల ప్రాయశ్చిత్త దీక్ష విరమణ సందర్భంగా ఆ పార్టీ నేతలు నగర సంకీర్తన నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు ఆధ్వర్యంలో బుధవారం పట్టణ పరిధి డబ్బూరివీధిలో గల వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే అశోక్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయం నుంచి గిలాయివీధి, డబ్బూరివీధి, రథంవీధి, దాసన్నపేట మీదుగా బస్టాండ్ వరకు నగర సంకీర్తన జరిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తిప్పన దుర్యోధనరెడ్డి, బైపల్లి ఈశ్వరరావు, నాగుల హరిబెహరా, మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, సహదేవ్‌రెడ్డి, పద్మనాభం, రోకళ్ల భాస్కర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ గ్రామీణ బ్యాంకు ఏర్పాటుకు కృషి చేస్తా

అరసవల్లి: జాతీయ గ్రామీణ బ్యాంకు ఏర్పాటుకు కృషి చేస్తామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. బుధవారం అఖిల భారత ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల గోల్డెన్ జూబ్లీ వార్షికోత్సవ వేడుకలు స్థానిక అరసవల్లి రోడ్డులో గల ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఉత్తరాంధ్రలోని ఐదు రీజియన్ల నుంచి ఆర్ఎంలు, సిబ్బంది, సంఘాల నాయకులు 1000 మందికి పైగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 12వ వేతన సవరణ ఒప్పందాన్ని, వాణిజ్య బ్యాంకులతో సమానంగా అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై సభ్యులంతా హర్షం వ్యక్తం చేసారు. హక్కుల పరిరక్షణకు చేపట్టే ఎటువంటి కార్యాచరణకైనా సిద్ధంగా ఉండాలని ఏఐఆర్‌బీఆర్ సెక్రటరీ జనరల్ ఎస్.వెంకటేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉభయ సంఘాల అధ్యక్షులు కేకే మక్సూడ్, పి.వేణురావు, జనరల్ సెక్రటరీలు గంట అప్పలనాయుడు, రాజు, ప్రాంతీయ అధికారులు, ఇతర కార్యవర్గ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

పొందూరు: మొక్కలు పెంచడం ద్వారానే మానవ మనుగడ సాధ్యమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మొక్కలను నాటారు. ప్రస్తుతం విపరీత వాతావరణ పరిస్థితులకు గ్లోబల్ వార్మింగే కారణమని అన్నారు. మొక్కలను పెంచడం ద్వారా దీనిని నుంచి బయటపడవచ్చునన్నారు. ఎంపీడీవో హరిహరరావు, ఈవో మోహన్‌బాబు, టీడీపీ నాయకులు బలగ శంకరభాస్కర్, బాడాన గిరి, ఎ.చినరంగ, మాజీ సర్పంచ్ ఎ.విజయ లక్ష్మి కె.శ్రీను, డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

రణస్థలం: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చిన పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీఎహెచ్ఎస్ కల్యాణబాబు అన్నారు. బుధవారం కొండములగాం సీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. సీహెచ్‌సీకి మంజూరైన ఎక్సరే, బెడ్స్ తదితర వాటిని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. రికార్డులు పరిశీలించారు. అన్నిరకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పోలాల అమావాస్య పూజలు

శ్రీకాకుళం కల్చరల్: విశాఖ-బీ కాలనీలో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో మహిళలు పోలాల అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది భక్తులు పాల్గొని లక్ష్మీదేవికి పూజలు చేశారు.

మద్యం పాలసీపై ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా

అరసవల్లి: నూతన మద్యం పాలసీపై ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కన్వీనర్ ఎ.లక్ష్మి శ్రీదేవి మాట్లాడుతూ.. అక్టోబరు నుంచి అమలు కానున్న కొత్త మద్యం పాలసీ లక్ష్యం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నేరాలను అరికట్టడం, ప్రజల ఆరోగ్యం, ముఖ్యంగా మహిళలు, పిల్లలపై హింసను అరికట్టడం ప్రభుత్వ బాధ్యతని, మరి మద్యం అమ్మకాలతో అది ఎలా సాధ్యపడుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ మద్యం బ్రాండ్ల వల్ల దాదాపు 30వేల మంది చనిపోయారని, కొత్త మద్యం విధానంలో నాణ్యమైన మద్యం ప్రజల ప్రాణాలు తీయదా అని ప్రశ్నించారు. మద్యాన్ని అరికట్టాల్సిందిపోయి కొత్త మద్యం పాలసీ తీసుకురావడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు శ్రీదేవి పాణిగ్రాహి, ఎం.లలిత, ఎ.లత, నర్సమ్మ, కుమారి, పద్మ, లక్ష్మి, పున్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: పెనసాంలో బుధవారం పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. గ్రామానికి చెందిన పలువురు నాయకులు పారిశుధ్య కార్మికులు సేవలకు గుర్తింపుగా వారికి దుస్సాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. సర్పంచ్ తోత్తడి రామారావు, నాయకులు కుదిరెళ్ల బుజ్జి, తాళాబత్తుల పైడిరాజు, అప్పారావు, గోవిందరావు, ఈవోఆర్డీ ఎస్.శ్రీవాసులు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

శ్రీకూర్మ క్షేత్రంలో స్వచ్ఛత హి సేవా

గార: ప్రసిద్ధ శ్రీకూర్మ క్షేత్రంలో బుధవారం స్వచ్ఛత హి సేవా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో చెత్తచెదారాలు లేకుండా శుభ్రం చేశారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి



శ్రీకాకుళం కలెక్టరేట్: కలెక్టర్ కార్యాలయం వద్ద కలెక్టర్ పుండ్కర్, ఇతర అధికారులు



గుజరాతీపేట: జిల్లా కోర్టు ప్రాంగణంలో గాంధీ చిత్ర పటం వద్ద జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా, తదితరులు..



ఎచ్చెర్ల: ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో..



ఆమదాలవలస: గాంధీ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

జాతిపిత మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, కార్యాలయాల్లో బాపూజీ విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ చూపించిన అహింసా మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. - ఆంధ్రజ్యోతి బృందం



అరసవల్లి: టీడీపీ జిల్లా కార్యాలయంలో..



శ్రీకాకుళం కల్చరల్: శాంతినగర్‌లోని గాంధీ మందిరంలో..



ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో..



శ్రీకాకుళం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ..



ఇచ్ఛాపురం: లొద్దపుట్టిలో ఎమ్మెల్యే బెందాళం అశోక్..



అరసవల్లి: జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో..



నరసన్నపేట: పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తదితరులు



హిరమండలం: గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాల వద్ద జడ్పీటీసీ బుచ్చిబాబు, టీడీపీ నాయకులు



పలాస/కాశీబుగ్గ: గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు



టెక్కలి: గాంధీ విగ్రహం వద్ద టీడీపీ నేతలు..



శ్రీకాకుళం కల్చరల్: గాంధీ స్మృతివనంలో లాల్‌బహదూర్ శాస్త్రి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

స్వచ్ఛ శ్రీకాకుళం లక్ష్యం

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు



సైకిళ్లపై ర్యాలీగా వెళ్తున్న కలెక్టర్, కేంద్రమంత్రి, ఎమ్మెల్యే, ఎస్పీ

అరసవల్లి: స్వచ్ఛ శ్రీకాకుళం లక్ష్యంగా అందరం కలసి పనిచేద్దామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హి కార్యక్రమం ముగింపు సందర్భంగా బుధవారం స్థానిక 80 అడుగుల రోడ్డు జంక్షన్ నుంచి కలెక్టర్ కార్యాలయ సమీపంలోని డచ్ భవనం వరకు ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డితో కలసి ఆయన సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అక్కడ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశం రూపురేఖలు మార్చాలంటే దేశం స్వచ్ఛంగా ఉండాలన్నారు. స్వచ్ఛతా హి కార్యక్రమంలో భాగంగా గత రెండు వారాలుగా జిల్లాలోని నదులు, పార్కులు, అన్ని డార్క్ పాయింట్లను శుభ్రం చేశామన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన సఫాయి మిత్రలకు కేంద్రమంత్రి సత్కరించారు. చిత్రలేఖనం, వ్యాసరచన తదితర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులు చెత్తతో తయారుచేసిన వివిధ కళారూపాలు, వస్తువులను తిలకించి వారిని అభినందించారు. అందరితో స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అటవీశాఖ అధికారి సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలే ప్రాణదాతలు



రక్తదానం చేస్తున్న జేసీ, డీఎస్పీ

రణస్థలం: రక్త సేకరణకు పరిశ్రమలు లేవని, మానవుడే రక్త పరిశ్రమని, రక్తదానం చేసిన ప్రతి ఒక్కరూ ప్రాణదాతలేనని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. బుధవారం ఎన్ఈఆర్ క్యాంపు కార్యాలయంలో గాంధీ జయంతిని పురస్కరించుకొని ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ శ్రీ మహాలక్ష్మీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శి బిరం నిర్వహించారు. 612 మంది, యువతీ, యువకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు రక్తదానం చేశారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, డీఎంహెచ్‌వో మీనాక్షి, రెడ్‌క్రాస్ ఛైర్మన్ జగన్మోహన్‌రావు మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన ఆరోగ్యమంతో పాటు గుండె జబ్బులు తగ్గుతాయని, ఎర్ర రక్త కణాలకు ఉత్పత్తి చేసే ప్లీహము సరికొత్త శక్తితో పనిచేయడం ప్రారంభిస్తుందన్నారు. స్కూల్ డైరె క్టర్ నడుకుదిటి తేజాబాబు ప్రత్యేక పర్యవేక్షణలో శ్రీ మహాలక్ష్మీ యూత్ క్లబ్ స భ్యులు సేవలు అందించారు. కాగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, డీఎస్పీ వివేకనంద, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ యువతోపాటు రక్తదానం చేశారు. కూట మి నాయకులు లంక శ్యామలరావు, లంక ప్రభకరరావు, పిన్నింటి భానోజీనా యుడు, డీజీఎం ఆనందరావు, పిసిని జగన్నాథంనాయుడు, నారాయణశెట్టి శ్రీనివా సరావు, దన్నాన సత్తిబాబు, బలివాడ శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

సోంపేట: పర్యావరణం కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో బెందాళం వెంకటరమణ అన్నారు. పట్టణంలోని ఎస్‌డబ్ల్యూపీసీ ఆవరణలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తడక యశోధ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి

అరసవల్లి: విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ఏడురోడ్ల జంక్షన్ వద్ద బుధవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ మాట్లాడుతూ.. 32 మంది ప్రాణ బలిదానాలతో, వామపక్ష ఎంపీ, ఎమ్మెల్యేల రాజీనామాలతో విశాఖ స్టీల్ ప్లాంట్ ఏర్పాటయ్యిందన్నారు. ఇది ఏ ఒక్కరి సొత్తు కాదని, ప్రైవేటీకరణతో యువత జీవితాలు రోడ్డున పడతాయన్నారు. ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. అలాగే తిరుపతి లడ్డూ వ్యవహారంతో ప్రజలను మోసం చేస్తోందన్నారు. మద్దతుగా జేవీవీ రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తేజేశ్వరరావు, నల్లి ధర్మారావు సంఘీభావం తెలిపారు. దీక్షలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ రాజు, సహాయ కార్యదర్శి ఎం.సంతోష్, కన్వీనర్ పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఐదుగురు క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులతో అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం స్పోర్ట్స్: జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా నుంచి ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. బాలుర నుంచి ముగ్గురు, బాలికల నుంచి ఇద్దరు క్రీడాకారులు ఉన్నారు. రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు గత నెలలో శ్రీకాకుళంలో జరిగాయి. ఇందులో శ్రీకాకుళం బాలురు ద్వితీయస్థానం, బాలికలు తృతీయస్థానాలు కైవసం చేసుకున్నారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ చూపిన మెట్ట అఖిల్, యతిరాజులు, లక్ష్మి ప్రసాద్, మొదలవలస యశ్వంత్ (కేశవరావుపేట), సింహాద్రి (ఇప్పిలి), లావణ్య, దేవీప్రియ (ఇప్పిలి), అన్నెపు సంధ్య (కేశవరావుపేట) జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరంతా ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు నంద్యాల్లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. వీరి ఎంపికపై జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి వెంకటరమణ, కార్యదర్శి ఎంవీ రమణ, ఛైర్మన్ బడగల హరిధర్‌రావు, ఒలింపిక్ సంఘం జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, జి.మల్లేష్, రామరాజు, గ్రిగ్స్ సంయుక్త కార్యదర్శి కె.మాధవరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

బూర్జలో 'స్వచ్ఛతా హి సేవా'



మొక్క నాటుతున్న రామకృష్ణ

బూర్జ: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీ స్టేట్ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు పాల్గొని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీడీవో తిరుపతిరావు, ఏపీఎం బాబూరావు, పరిపాలనాధికారి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-2047లో ప్రతిభ

ఆమదాలవలస: స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో పట్టణానికి చెందిన జి.నేహా అనే విద్యార్థిని ద్వితీయ స్థానం సాధించింది. మెట్టక్కివలస మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఈ బాలిక జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడంపై బుధవారం పలువురు అభినందించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ తమ్మినేని గీత, టీడీపీ నాయకులు తమ్మినేని విద్యాసాగర్, మొదలవలస రమేష్, నాగళ్ల మురళీధర్ యాదవ్, రాడ విజయ్‌కుమార్, హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

సోంపేట: బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంజన ఫౌండేషన్, ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డి.రామారావు తెలిపారు. జాబ్‌మేళా కోసం ఆన్‌లైన్‌లో ఎన్ఏఐపీయూఎన్‌వైఏఎం.జీవోవీ.ఇన్ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 6305587418, 9652267682 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

మద్యం దుకాణాలకు ఒక్క దరఖాస్తే

శ్రీకాకుళం, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 158 ప్రైవేట్ మద్యం దుకాణాలు ఏర్పాటుకుగాను గత రెండు రోజుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. తొలిరోజు ఎవరూ దరఖాస్తు చేయకపోగా.. రెండో రోజు బుధవారం శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న దుకాణానికి ఒక దరఖాస్తు అందింది. ఇప్పటికి ఇదే తొలి దరఖాస్తు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తుల ప్రక్రియ స్వీకరణ ఆన్‌లైన్‌లో కొనసాగుతుంది. అలాగే ఈ నెల 11న మద్యం దుకాణాల కేటాయింపుపై కలెక్టర్ డ్రా తీయనున్నారు.

బహుమతులు అందజేత

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం ఇంటాక్ చాప్టర్ నిర్వహించిన క్విజ్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు బహుమతులు అందచేశారు. బుధవారం ఉదయం డచ్ భవనం వద్ద జరిగిన ఓ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తులను వెలికితీయాలన్నారు. గతేడాది జరిగిన పోటీల్లో శ్రీకాకుళం విద్యార్థిని కుమారి కావ్య జాతీయ స్థాయిలో బహుమతి గెలుచుకుందని ఇంటాక్ కన్వీనర్ నూక సన్యాసిరావు మంత్రికి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర రెడ్డి, జేసీ, నగర కార్పొరేషన్ కమిషన్ డీవీవీ ప్రసాద్, వావిలపల్లి జగన్నాథంనాయుడు, ఇంటాక్ ప్రతినిధులు నటుకుల మోహన్, హారికా ప్రసాద్ కొమ్ము రమణమూర్తి, పొన్నాడ రవికుమార్ పాల్గొన్నారు.

ఆరోపణలు మానుకోవాలి

సరుబుజ్జిలి: వివిధ శాఖలకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల మేరకు అధికారులు చేపడుతున్న చర్యలకు సంబంధం లేని కూటమి నాయకులపై ఆరోపణలు మానుకోవాలని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో టీడీపీ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ.. పెద్ద వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో ఆయాగా విధులు నిర్వహిస్తున్న మహిళ ఉపాధి హామీ పనిలో కూడా లబ్ధి పొందినట్టు గుర్తించి ఎంఈవో ఆమెను తొలగించారన్నారు. దీన్ని ఆ గ్రామ వైసీపీ నాయకలు రాజకీయం చేస్తూ కూటమి నాయకులపై ఆరోపణలు చేయడం పద్ధతి కాదన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు, నాయకులు కందుల వెంకటరావు, వెంకటరమణ, వెంకునాయుడు, తిరుపతిరావు పాల్గొన్నారు.

20 రోజులుగా ఇంతే

- వెలగని వీధి లైటు.. ఇబ్బందిపడుతున్న ప్రజలు

అరసవల్లి: శ్రీకాకుళం నగరం, విశాఖ-ఏ కాలనీలో సూర్యానగర్‌లో, కథానిలయం దగ్గర గల వీధి లైటు గత 20 రోజుల నుంచి వెలగడం లేదు. ఈ జంక్షన్ కాజీపేట మీదుగా, అరసవల్లి వెళ్లేందుకు కీలక రహదారి కావడంతో రాత్రి పూట పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి వీధి దీపం వెలిగించాలని, చీకట్లు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



వెలగని వీధి లైటు ఇదే

భళా శశి!

- యోగాలో చిన్నారి ప్రతిభ
- అబ్బురపరిచేలా ఆసనాలు
- సొంతంగానే శిక్షణ

కంచిలి: ఎందులోనైనా రాణించాలంటే అవకాశాలు, శిక్షణ, తోడ్పాటు ఎంతో అవసరం. అయితే నేర్చుకోవాలనే తపన, ఆసక్తి ఉంటే గురువు లేకున్నా రాణించొచ్చని ఈ చిన్నారిని చూస్తే తెలుస్తుంది. నిరుపేద ఇంట పుట్టి, తల్లిదండ్రులు ఉపాధి కోసం ఊరురా తిరుగుతూ ఉంటే వారితోపాటే ఉంటూ యోగాపై తనకున్న ఇష్టాన్ని మొబైల్ సాయంతో మెరుగుపరుచుకుంటూ ప్రస్తుతం అద్భుతమైన విన్యాసాలతో అందరి చేత భళా అనిపించుకుంటుంది.. కంచిలి మండలం కత్తివరం ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న శ్రీకాకుళపు శశి. వివరాల్లోకి వెళితే..

శశి.. తల్లిదండ్రులు శ్రీకాకుళపు వాసు, ఈశ్వరమ్మ ఇటుక బట్టీల్లో రోజువారీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. వీరి స్వస్థలం విజయనగరం జిల్లా నెల్లిమర్ల గ్రామం. గ్రామ సమీపంలోని ఇటుక బట్టీలో కూలీలుగా ఉంటూ జీవనం సాగించడం, అక్కడ పని పూర్తయితే, వేరొక ప్రాంతానికి వలస వెళ్లడం చేస్తుంటారు. అలాగే శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలానికి వలస వచ్చారు. ప్రస్తుతం కత్తివరం గ్రామంలో ఉంటూ.. తన కుమార్తె శశిని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదివిస్తున్నారు. చిన్నప్పటి నుంచి శశి అందరి ఆడపిల్లల మాదిరిగా కాకుండా ఆటల్లో చురుగ్గా ఉండటం, గెంతులు వేస్తుండటంతో తల్లి ఈశ్వరమ్మ మందలించేది. దీంతో శశి తన విన్యాసాలను ఇంటి వద్ద కాకుండా పాఠశాలలోను, బయట స్నేహితుల వద్ద చేసి చూపిస్తుండేది. ఇది గమనించిన ఆ పాఠశాల హెచ్ఎం మాధవి బెహరా.. శశి చేస్తున్న విన్యాసాలను ఫొటోలు, వీడియో తీసి ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువచ్చింది. పెద్దవారు సైతం ఎన్నో నెలలు శ్రమిస్తే తప్ప, చేయలేని యోగాలోని అతికష్టమైన భంగిమలను ఆ చిన్నారి సునాయాశంగా చేయడం చూసి అటు తల్లిదండ్రులతోపాటు గ్రామస్థులు ఆశ్చర్యంతో ఆ చిన్నారిని అభినందిస్తున్నారు. ఇటువంటి విద్యార్థినికి ప్రభుత్వం తగిన ప్రోత్సాహం, తోడ్పాటు అందిస్తే యోగాలో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.



ఆసనాలు వేస్తున్న శశి